# దీపం చెప్పిన కతలు

గోపిని కరుణాకర్

చెరువులు, దొరువులు, కుంటలు, మడుగులు నిండి నట్టున్నాయి. కప్పలు గొంతెత్తి బెక బెకమని బృందగానం చేస్తు న్నాయి.

"నిద్దరగూడా సచ్చిపోయింది. వొళ్ళంతా నొప్పులు" అని వొళ్ళు విరుచుకునింది ఇరుగింటి దీపం.

"ఒక్కరాత్తిరి నిద్దర లేనందుకే వొళ్ళు నొప్పు లంటా వుండావే? కంగుంది కుప్పం ఆటగాళ్ళు

## కంగుంది కుప్పమోళ్ళ ఆటపాట

పద్దెనిమిది రాత్రులు పద్దెనిమిది పర్వాలు ఆట కడ తారు. వొళ్ళు అలిసిపోయేలా ఆడతారు. గొంతు రాసుకుపొయ్యేలా పాడతారు. తెలుసా?" అని అడిగింది పొరుగింటి దీపం.

"పద్దెనిమిది రాత్రులే? ఓయమ్మా! నేనైతే నిగిడి సస్తాను తల్లే!" అనింది ఇరుగింటి దీపం.




"కంగుంది కుప్పమోళ్ళ ఆటపాట గురించి చెప్పుకుంటా వుంటే వినడమేకాని ఏపొద్దు ఈ పాపిష్టి కళ్ళతో చూళ్ళేదు" అనింది గుడిసింటి దీపం.

"ఏమి ఆటలు? ఏమి పాటలే వాళ్ళవి? పురివిప్పి నెమలి ఆడినట్టు ఆడతారు. కోకిలలు కూసినట్టు పద్దేలు పాడతారు. మెరుపు మెరుస్తుంది. ఉరుము ఉరుము తుంది. పలపలా వాన కురుస్తుంది. ప్రకృతి పులకి స్తుంది" అని చెప్పింది పొరుగింటి దీపం.

"ఎట్టెట్టా! వాళ్ళు పాడితే వానలు కురు స్తాయా? ఇది జరిగే పనేనా? ఎక్కడైనా మంత్రా లకి చింతకాయలు రాలుతాయా?" అని నవ్వింది ఇరుగింటి దీపం.

"మంత్రాలకి చింతకాయలు రాల తాయో లేదో? నాకు తెలీదు కాని కంగుంది కుప్పమోళ్ళు గొంతెత్తి పద్దెం పాడితే వానలొస్తాయి. చెరువులు, దొరువులు నిండుతా యి" అనింది పొరుగింటి దీపం.




"అయితే ... ఆ కతేందో చెప్పరాదా?" అని అడిగింది గుడిసింటి దీపం.

పొరుగింటి దీపం తలా డిస్తా కతనెత్తుకునింది.

* * *

ఎండలు మిడిమాలంగా కాస్తా వుండాయి.

చెరువులు, దొరువులు ఎండిపొయినాయి. గొడ్లు వొట్టి నేలని కొర క్కతిని మూతి కాల్చుకుంటా వుండాయి.

అపిరెడ్డిగారిపల్లెకాడ బారతం పెడుతున్నట్టు బుధువారం సంతలో వీర తిమ్మగోడు పలకకొట్టి చాటింపు వేసినాడు.

బారతం బొమ్మలు పల్లెపల్లె తిరిగినాయి. వడ్లు, దుడ్లు వసూలు చేసి నారు.

బారతం మిట్టన స్టేజ్ కట్టినారు. వెనక రంగులు పూసుకునేదానికి సొపారు వేసినారు. తలపలపేట కోమటోళ్ళు

అంగళ్ళు పెట్టినారు. మెల్లమెల్లంగా బారతం మిట్టకి బారతం కళ వచ్చేసింది.

కంగుంది కుప్పం ఆటగాళ్ళు పిల్లాజెల్లతో సహా కాసరబీసరని బస్సు దిగినారు. గదలు, అంబుల పొది, విల్లులు పట్టుకోని వీధిలో నడస్తా వుంటే జనం ఇళ్ళల్లోనుంచి బయటికొచ్చి ఇచ్చిత్తరంగా చూస్తా వుండారు.

కుక్కలు వాళ్ళను చూసి మొరుగుతున్నాయి.

తిరపతి నుంచి పగలు కత చెప్పే హరిదాసు గూడా దిగిపొయినాడు.

కానగమాకుల కింద ఇసిపెట్టాకులాట మహా జోరుమింద జరగతా వుండాది. పోలీసులొస్తే వొంటిమింద లుంగీ జారిపొయినా పట్టించుకోకుండా పరిగెత్తతా వుండారు.

పగలు హరిదాసు కత చెప్తాడు. రాత్తిరి కంగుంది కుప్పం వాళ్ళు ఆటాడుతారు.

ఎండాకాలం గదా! పనుల్లేక రైతులంతా తీరిగ్గా వుంటారు. కంగుంది కుప్పమోళ్ళ ఆటలూ పాటలే వాళ్ళకి కాలక్షేపం. ఈసుళ్ళపుట్ట పగిలినట్టు చుట్టుపక్కల పల్లెల నుంచి జనం తండోపతండాలుగా వస్తున్నారు.

చిన్నవ్వ రెండు శేర్లు నెంబరొడ్ల బియ్యం వొండి పులుసన్నం చేసి సద్దిమూట కట్టింది. చాపచుట్టి సంకన పెట్టుకునింది.

వీధిలో ఆడుకుంటా ఎదురొచ్చిన పెదబ్బ, ''ఎక్కడికివా యలబారినావు?'' అని అడిగినాడు.

''పీలేరు గవర్నమెంటు ఆసుపత్రికి పొయ్యి సూదేసుకోని వస్తాను. నువ్వు గూడా వస్తావా? నీకు సూదేయిస్తా?'' అనింది చిన్నవ్వ.

''నాకు తెలుసులే. సూదీగాదు గీదీగాదు. నువ్వు బారతానికి పోతా వుండావు. నేను గూడా వస్తాను'' అన్నేడు పెదబ్బ.

''వద్దు నాయన! ఎండలు చూడు మిడిమాలంగా కాస్తా వుండాయి. అప్పిరెడ్డిగారిపల్లె కాడికి నడుచుకోని పోవల్ల'' అనింది చిన్నవ్వ.

''నన్ను ఎత్తుకోవద్దులే. నేను నీతోపాటు నడుస్తాను'' అన్నేడు పెదబ్బ.


''యాడికిరా నువ్వు పొయ్యేది? రెయ్యంతా మేలుకోని పెద్దబారతం చూసినోడు. నోరుమూసుకోనుండు. తిరమలకొండకి పొయ్యేటప్పుడు తిరపతిలో సినిమా చూద్దాంగాని'' అనింది కల్లేణమ్మ.

''ఆ... నాకు తిరపతిలో సినిమా వద్దులే. నేను బారతమే చూస్తాను'' అని మొండికేసినాడు పెదబ్బ.

''సరేలే.. గుడ్డలు తొడుక్కోనిరాపో... పదాం... '' అనింది చిన్నవ్వ.

ఆ మాటతో పరిగెత్తుకుంటా ఇంట్లోకి పొయ్యి వుతికిన గుడ్డలు తొడుక్కోని వచ్చినాడు.

''తిరపతిలో దిగినప్పుడు సినిమా చూడాలని మొండికేసినావనుకో? నా కొడకా నిన్ను తన్నీతన్నీ రామరాజ్ కొటాయికాడ సవిటి కాలవలో ముంచేసి, నేను తిరమల కొండ బస్సు ఎక్కతా'' అనింది కోపంగా కల్లేణమ్మ.



## రేడియా మీటర్

**మీ**రెప్పుడయినా రేడియా మీటర్‌ను చూశారా? చూడడానికి అది మామూలు ఎలక్ట్రిక్ బల్బ్‌లాగే వుంటుంది. అయితే, అందులో ఫిలమెంట్ బదులు సీతాకోకచిలుక రెక్కలలా వుండే 4 సాధనాలు వుంటాయి. కుడిపక్క వుండే రెక్కలు నల్లగాను, ఎడం వైపు రెక్కలు తెల్లగానూ వుంటాయి. వెలుతురులోకి వచ్చినప్పుడు ఈ రెక్కలు అటు ఇటు కదలాడుతాయి. వాతావరణంలోని వేడిని తెలుసుకోవడానికి వుపయోగించే ఈ పరికరాన్ని సూర్యరశ్మిలోకి తీసుకు వచ్చినప్పుడు రెక్కలు మరింత వేగంగా కదులుతాయి. వీటి కదలికల వేగాన్ని బట్టి ఉష్ణతాపాన్ని అంచనా వేస్తారు. ఈ పరికరానికి బ్యాటరీలుగాని, ఇతర ఇంధనాలు గాని అవసరం లేదు.

''అట్నేకానిలే... పో'' అనేసి చిన్నవ్వతో యలబారినాడు పెదబ్బ.

వీధిలోకి వచ్చేసరికి ఎంగట్రామన్న, లచ్చుమక్క, బొజ్జత్త, రామాంజులు వొదిన, పిచ్చవ్వ, రాజన్న, సక్కు పిన్నమ్మ అందరూ చాపలెత్తుకోని బారతానికి యలబారినారు.

కొంచెం దూరం నడిచేసరికి పెదబ్బకి కాళ్ళు కాలినాయి. నడవలేనని మొండికేస్తే, వీపుకి పెదబ్బని ఉప్పుమూట ఎత్తుకోని అపిరెడ్డిగారి పల్లెదాక నడిచింది చిన్నవ్వ.

అప్పటికే పచ్చని పందిళ్ళ కింద హరిదాసు కత చెప్తా వున్నేడు.

ఏరోజుకారోజు కానగ మాకుల్ని కొట్టకొచ్చి పందిళ్ళమింద కప్పుతున్నారు. కింద ఇసిక పోసినారు. ఎండలు మండిపోతున్నా ఆ పందిళ్ళ కింద చల్లగా వున్నింది.

ఆ పొద్దు మాయాబజార్ కత చెప్పినాడు హరిదాసు. దీన్నే రాత్తిరికి నాటకంగా ఏస్తారు ఆటోళ్ళు.

పొద్దుగూకతానే మిషనబాయి దెగ్గిరికి పొయ్యి సద్దిమూటలు విప్పినారు. చిన్నవ్వ పులుసన్నం ముద్దలు చేసి చేతిలో పెడతా వుంటే తింటున్నాడు పెదబ్బ. ఇదే పులుసన్నం ఇంట్లో తింటే రుచి ఉండదు. సద్దిమూట కడితే దాని రుచే వేరు.

మజ్జిగలో నానిన పచ్చిమిరపకాయలని నంజుకుంటా, పులుసన్నాన్ని తింటుంటే నోటికి పుల్లపుల్లంగా, కారంకారంగా భలే వుంటుంది.

గబగబా అన్నాలు తినేసి నువ్వు ముందా నేను ముందా అని బారతం మిట్టకి పరిగెత్తినారు. స్టేజికి దగ్గరగా మొదటి వరసలోనే చాపలు పరిసేసింది చిన్నవ్వ. ఆడవాళ్ళు వక్కాకు వేసుకుంటా ఆ మాట ఈమాట అరువులు చేసుకుంటా వుండారు. పిలకాయలు బీడు చేన్లో ఆడుకుంటా వుండారు.

పెదబ్బ డేరా వెనక ఏం జరగతా వుండాదో చూద్దామని పొయినాడు. అక్కడ సాపారిలో ఆట ఆడేవాళ్ళు పెట్రోమాక్స్ లైట్ల ఎలతర్లో కుర్చోని చిన్నచిన్న అద్దాల్లో చూసుకుంటా, ముఖానికి రంగులు పూసుకుంటా వుండారు.

గదలు, విల్లులు, అంబులపొది, కిరీటాలని చూరుకి వేలాడదీసినారు. వాళ్ళు కట్టుకునే పట్టు వస్త్రాలు, నగలు, బంగారు కిరీటాలు, వాళ్ల దిరుసులు పెట్రోమాక్సు లైట్ వెలుగులో ధగధగా మెరిసిపోతున్నాయి.

పెదబ్బ కళ్ళు జిగేలుమన్నాయి. అవి గిల్టు నగలని తెలీదు పాపం!

ఒగాయన లుంగీ కట్టుకున్నాడు. చొక్కాయి వేసుకోలేదు. కపిలి బానంత కడుపు ముందుకి తోసుకోని వచ్చింది. గుమ్మడికాయంత సైజులో వుండే పెదపెద్ద రొమ్ముల్ని కట్టుకున్నాడు. వాటి మింద రైకేసుకున్నేడు. జుట్టు విరబోసుకున్నేడు. కోరలు తీసుకున్నేడు.

ఆడరాచ్చిసి మాదిరి తయారైనాడు.

ఇంగొకపక్క కృష్ణుడు తిన్నెమింద కుర్చోని రంగులు పూసుకునే వాళ్ళతో మాట్లాడతా భలే సమ్మగా బీడీ తాగతా వుండాడు.

ఆ పక్కనే పంచపాండవులు, కౌరవులు కుర్చోని ఇసపెట్టాకులు ఆడతా వుండారు. ద్రౌపది కూడా వాళ్ళతో కుర్చోని ఆడతా వున్నింది.

''అన్నయ్యా బీడీ వుంటే ఇస్తావా?'' అని అడిగింది ద్రౌపది ఆకులు కిందపడేసి.

దిరుసుని పకెత్తి చారల చెడ్డీలో చెయ్యిపెట్టి తడిమి.

''అయిపొయినట్టుండాయి చెల్లే!'' అన్నేడు కృష్ణుడు.

''నిండు కొలువులో అన్నయ్యా అని అరిస్తే చీరలిచ్చినావే! ఇప్పుడు నోరు తెరిసి అడిగితే బీడీ లేదంటావా? నాలిక తిమ్మిరెక్కింది. ఇప్పుడు దమ్ము కొట్టకపోతే నాలికమింద పద్దెం తిరగదు''

అని చెప్పేసి అక్కడ నిలబడుకోని చూస్తా వుండే పెదబ్బని పిలిచింది ద్రౌపది.

పెదబ్బ దెగ్గిరికి పొయినాడు. రూపాయి బిళ్ళ చేతిలోపెట్టి,

''బీడీకట్ట తెచ్చి ఇస్తావా?'' అని అడిగింది.

పెదబ్బ పరిగెత్తుకుంటా పొయ్యి కోమటోళ్ళ అంగిట్లో బీడీకట్ట తెచ్చి ఇచ్చినాడు. బీడీ తీసి నోట్లో పెట్టుకుని, అగ్గిపుల్ల గీసి ముట్టించుకునింది. రెండు గుక్కలు ఆత్తరమాత్తరంగా తాగింది.

భలే ఇచ్చిత్తరంగా అనిపించింది పెదబ్బకి. పరిగెత్తుకుంటా చిన్నవ్వ దెగ్గిరికి వచ్చినాడు

''అవా... అవా! ద్రౌపది బీడీ తాగతా వుండాది. చూద్దువురావా?'' అని పిలిచినాడు పెదబ్బ.

చిన్నవ్వ నవ్వింది.

''ఆడోళ్ళు ఎక్కడైనా బీడీ తాగతారా? తప్పుగదా!'' అన్నేడు.

''ఎందుకు తప్పు? ద్రౌపది వేషం కట్టింది మగోడే గదా!'' అనింది చిన్నవ్వ.

ఆపొద్దు మాయాబజార్ నాటకం ఆడినారు.

పాండవులు వనవాసంలో వుంటారు. శశిరేఖని అభిమన్యునికి ఇవ్వడం బలరాముడికి ఇష్టం వుండదు. సుభద్ర వచ్చి అన్నని చేతులు పట్టుకోని అడుగుతుంది.

''రాజ్యాన్ని పోగొట్టుకుని అడువుల పాలై ఆకులూ, అలుములు తినే వాళ్ళ ఇంటికి నా బిడ్డని కోడలిగా పంపించను గాక పంపించను. అష్ట ఐశ్వర్యాలతో తులతూగే కౌరవుల ఇంటికి కోడలిగా పంపిస్తాను'' అని పద్దెం పాడతా చెల్లెలిని తిట్టినాడు బలరాముడు.

బలరాముడి కాళ్ళు పట్టుకోని, చేతులు పట్టుకోని పద్దెం పాడతా కళ్ళ నీళ్ళు పెట్టుకునింది సుభద్ర. అయినా బలరాముడి మనసు కరగలేదు.

అది చూస్తా,

''అయ్యో! పాండవులంతటివాళ్ళకి ఎంత కష్టమొచ్చిందిగదా!'' అనేసి కండ్ల నీళ్ళు పెట్టుకునింది చిన్నవ్వ.

సుభద్ర, అభిమన్యుడ్ని పిలుచుకోని అడివిలో పోతా వున్నింది.

అప్పుడు,

''నరవాసన నరవాసన'' అని రాచ్చిసులు వచ్చేసినారు స్టేజిమీదకి. వాళ్ళ వెంట భూమి అదిరిపొయ్యేట్టు అడుగులేసుకుంటా వచ్చినాడు ఘటోత్‌గజుడు. కొంతసేపు అభిమన్యుడికి, ఘటోత్‌గజుడికి యుద్ధం జరిగింది. పద్దేలు పాడుకున్నేరు.

చివరికి,

''అన్నా... తమ్ముడా'' అని కావిలించుకోని ఒకరి క్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నేరు.

వాళ్ళని పిలుచుకోని ఇంటికి పొయినాడు ఘటోత్‌గజుడు.

''అబ్బా...! నరవాసన నరవాసన! ఎన్నాళ్ళయిందో? నరుల కాళ్ళ పులుసు చేసుకోని'' అని ఇంట్లోనుంచి వచ్చింది ఇంతింత రొమ్ములేసుకోని హిడింబి.

''అమ్మీ... వాళ్లని కూరొండుకునేదానికి వీల్లేదు. వాళ్ళు మన చుట్టాలే!'' అన్నేడు ఘటోత్‌గజుడు.

''చుట్టాలా...! ఎటుపక్కనుంచిరా అబ్బీ?'' అని అడిగింది.

''మా నాయన అదే నీ మొగుడు భీమసేనుడు వుండాడు గదా! భీమసేనుడి తమ్ముడు అర్జునుడు ఆయన నాకు చిన్నాయన. ఆయన పెండ్లాం సుభద్ర ఈమె. ఈ బుడతడు ఆయన కొడుకు అభిమన్యుడు. నా తమ్ముడే అమ్మీ!'' అని వివరంగా చెప్పినాడు.

''చెల్లెలా!'' అని కొండలూ కోనలూ వణికిపొయ్యేలా అరస్తా సుభద్రని కావలించుకునింది హిడింబి.

''ఒరేయ్... మన ఇంటికి చుట్టాలు వచ్చినారు. వాళ్ళకి విందు చేసి పెడతాను'' అని చెప్పి హిడింబి జనంలోకి పరిగెత్తింది. ఆమెను చూసి ఆడోళ్ళు జడుసుకున్నేరు. పిలకాయలైతే సలసలా ఉచ్చపోసేసినారు.

హిడింబి పరుగు పరుగున వచ్చి, పెదబ్బని గెద్ద తన్నకపొయినట్టు వీపునేసుకోని స్టేజి మిందకి ఎత్తుకోని పొయింది.

''ఓయమ్మల్లా నేను సచ్చిపోతినే, ఓ నాయనా నేను సచ్చిపోతినే'' అని పెదబ్బ లబలబా కాళ్ళూ చేతులూ కొట్టుకుంటా వుండాడు.

''చెల్లే... ఈ పిలగాడి గొంతుకోసి నెత్తురు పట్టిస్తా వేడివేడిగా తాగుతావా?'' అని అడిగింది హిడింబి.

''అమ్మీ... ఈళ్ళు మన మాదిరి రాచ్చిసులు గాదే! నరులు. నెత్తురు తాగరు. పాయసం తాగుతారు. పరవాణ్ణం తింటారు. గారెలు, బూరెలు, లడ్డూ, అన్నం కూర, చారుపప్పు తింటారే అమ్మీ'' అన్నేడు ఘటోత్‌గజుడు.

''అట్లనా... అదెంతపని. చిటికెలో చేస్తాను. ఈపొద్దు నువ్వు బతికిపొయినావురా పిలగా!'' అని చెప్పి పెదబ్బని వదిలేసింది.

పెదబ్బ చస్తినో బతికితినో అని పరిగెత్తుకుంటా వచ్చి చిన్నవ్వ వొళ్ళో దూరుకున్నేడు.

అది చూసి జనం భలే నవ్వినారు.

ఇట్లా తమాసతమాసగా నడస్తా వున్నింది. నాటకం.

ఎక్కడున్నాయో మోడాలు వచ్చి కమ్ముకున్నేయి. వాన తిప్పిచ్చి మల్లిచ్చి కొట్టింది. స్వామీ... వానంటే వానగా దులే! చెరువులూ, దొరువులూ నిండే వాన!

కోమటోళ్ళ అంగుళ్ళు కూలిపొయినాయి. డేరా వెనక వుండే సాపారు పైకప్పు ఎగిరిపొయింది.

జనం చెట్టుకొకరు, పుట్టకొకరు చెల్లాచెదరైపొయినారు.

గువ్వ పిల్లల్ని అదుముకొన్నెట్టు చాపకప్పి పెదబ్బని రెక్కలకింద అదుముకోనింది చిన్నవ్వ. అయినా ముద్దగా తడిసిపొయినాడు పెదబ్బ.

పటపటమని ముఖంమింద చినుకులు పడుతున్నాయి.

అప్పుడొచ్చిన వాన ఇప్పటికీ ఒక్కొక్క పద్దెంగా పెదబ్బ గెవనాల్లో కురుస్తూనే వుంది.

పటపటమని మనసుమింద చినుకులు పడుతూనే వున్నాయి.

అని కత చెప్పింది పొరుగింటి దీపం.



## ఎలక్ట్రానిక్ పజిల్ గేమ్

పజిల్స్, పద వినోదాలు ఇష్టపడేవారి మెదడును మరింత పదును పెట్టేందుకు ఇప్పుడు ఎలక్ట్రానిక్ పజిల్ గేమ్ అనే పరికరం ఒకటి అందుబాటులోకి వచ్చింది. ఇందులో అసంఖ్యాకమైన పజిల్స్ ఎన్నో వుంటాయి. దీనిని ఎక్కడకు కావాలంటే అక్కడకు సులువుగా తీసుకెళ్లేందుకు వీలుగా చేతిలో ఇమిడిపోయే విధంగా రూపొందించారు. దీని కీబోర్డ్ కూడా మామూలు టైప్ మిషన్ కీ బోర్డ్ లాగే వుంటుంది (qwert). అయితే ఇందులో మౌస్ బదులు జాయ్ ప్యాడ్ వుంటుంది. దీనితో ఆడటం మొదలు పెడితే అసలు విసుగు వేయదని తయారీదారుల ప్రచారం.